క్లుప్తంగా

ఈకేవైసీకి క్యూ



ఈకేవైసీ కోసం వేచి ఉన్న వినియోగదారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజు పాలెం హెచ్‌పీ గ్యాస్ బ్రాంచి కార్యాలయానికి శనివారం వినియోగదారులు క్యూ కట్టారు. గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇస్తారని కొంత మంది ప్రచారం చేయడంతో వినియోగదారులు బారులు తీరుతున్నారు. గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులకు సంబంధించి ఈకేవైసీ ధ్రువీకరణ మాత్రమే చేస్తున్నామని డీలరు చెబుతున్నారు. వినియోగదారులు ఒకే సారి రావడంతో నిరీక్షించడానికి చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆయుష్మాన్ కార్డుల పంపిణీ



ఆయుష్మాన్ కార్డులు అందజేస్తున్న జమీల

విశాఖ విద్య: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతీ ఒక్కరికీ ఆయుష్మాన్ కార్డులు అందజేస్తోంది. దీనిలో భాగంగా జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీ సచివాలయం పరిధిలో ఆరోగ్య కార్యకర్త జమీల శనివారం ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. మొదటి విడతలో వచ్చిన కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు జమీల తెలిపారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత



పోషణ కిట్లు అందజేస్తున్న అనిత

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీకి ఐసీడీఎస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో కేంద్రాల నిర్వహణ బాధ్యతలను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం కేంద్రంలో సచివాలయ మహిళా సంక్షేమ కార్యదర్శి అనిత ఆధ్వర్యంలో శనివారం గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు.

నేడు ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణరావు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు బాబాను ప్రత్యేకంగా అలంకరించి అనంతరం భక్తుల దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. రాత్రి 10 గంటలకు ప్రత్యేక భజన , అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ బాబా సమక్షంలో కేక్ కటింగ్ ఉంటుందన్నారు.

చిత్రకారుడు శ్రీనివాస్‌కు అవార్డు



అవార్డుతో శ్రీనివాస్

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్‌కు జాతీయ అవార్డు వరించింది. ఇటీవల ముంబయిలో జాతీయ చిత్రకళా రంగోత్సవ్ సెలబ్రేషన్స్– 2023 జరిగింది. ఆ పోటీల్లో 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో చిత్రకారుడిగా పని చేస్తున్న శ్రీనివాస్ పాల్గొన్నాడు. చిత్రకళలో అందిస్తున్న సేవలను గుర్తించి కళాజీవి అవార్డు అందజేసినట్టు చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మన ఊరు–మన బాధ్యత

- పరిసరాల పరిశుభ్రం చేసిన కాలనీవాసులు
- డిప్యూటీ మేయర్ జియ్యాని పిలుపుతో ముందుకొచ్చిన ప్రజానీకం



52వ వార్డులో చెత్త కుప్పలు



చెత్త తొలగింపులో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: నగరంలో పారిశుద్ధ్య కార్మికుల సమ్మె చేపట్టడంతో పలు చోట్ల చెత్త పేరుకుపోయి రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఇచ్చిన పిలుపునకు ప్రజానీకం నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని శనివారం డిప్యూటీ మేయర్ శ్రీధర్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 52వ వార్డులో పేరుకు పోయిన చెత్తను స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. వార్డు పరిధిలోని ఆయా కాలనీ వాసులు, నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది అంతా దీనిలో స్వచ్ఛందంగా భాగస్వామ్యులయ్యారు. శాంతినగర్ నుంచి కరాస గాయత్రీ అపార్ట్‌మెంట్ , న్యూ కరాస సంజీవిని హాస్పటల్‌తో పాటు గాంధీ విగ్రహం, కరాస చేపల మార్కెట్ , సంజీవయ్య నగర్, శాంతినగర్ పార్క్ , మర్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్తను జేసీబీల సాయంతో లారీల్లో తరలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల విధుల్లో లేని సమయంలో ఎవరి పరిసరాలను వారే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలనీ వాసుల నుంచి మంచి స్పందన వచ్చిందని, ఇదే స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ శ్రమదానంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జియ్యాని మారుతీ , జియ్యాని విజయ్ కుమార్, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ , వెదుళ్ల శ్రీను, జీవీఎంసీ డీఈ ఏడుకొండలు, ఏఈ ఉష, సీవో సుధరాణి , వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు , సచివాలయ కన్వీనర్లు, ఆర్.పి.లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

61వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించే పనులను శనివారం పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టారు.విషయం తెలుసుకున్న సమ్మెలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు ఆయా ప్రదేశాలకు వచ్చి పర్మినెంట్ ఉద్యోగులు చేస్తున్న పనులకు అడ్డుపడ్డారు. దీంతో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ వచ్చి సమ్మె చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. పనులను అడ్డుకోవడం సరి కాదని.. సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని కోరారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి సమస్య తీసుకెళతామని ఆమె హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.



చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సచివాలయ సిబ్బంది



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

రసవత్తరంగా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు



సునీల్‌కు మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ అవార్డు అందజేస్తున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో శనివారం విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. మూడు మ్యాచ్‌ల్లో తలపడిన జట్లు పరుగుల వరద పారించాయి. లీగ్ దశ చివరికి రావడంతో పోటీల్లో ఉత్కంఠ పెరిగింది. నాగేంద్ర కాలనీ వండర్స్‌కు బాచి లైన్స్‌కు మధ్య జరిగిన తొలి మ్యాచ్ పోటాపోటీగా జరిగింది. నాగేంద్ర కాలనీ వండర్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బాచి లైన్స్ జట్టు 12 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఛేజింగ్ చేసిన నరేంద్రనగర్ కాలనీ వండర్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 151 మాత్రమే చేసి ఓటమి చవిచూసింది. బాచి లైన్స్ బ్యాటర్ సునీల్ 55 బంతుల్లో (19 సిక్స్‌లు, 3 ఫోర్లు)138 పరుగులు చేసపి మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ అందుకున్నారు. సునీల్‌కి 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ అందించారు.

➤ రెండో మ్యాచ్ బీఆర్‌పీ ఎలివెన్స్‌కు చెగువేరా యూత్ జట్ల మధ్య రసవత్తరమైన పోరు జరిగింది. ఇందులో చేగువేరా జట్టు గెలిచింది. బీఆర్‌పీ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 137 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. ఛేజింగ్‌లో దిగిన చేగువేరా యూత్ జట్టు 11.3 ఓవర్లలో 139 పరుగులు చేసింది చివరి బంతికి సిక్స్ కొట్టి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులో నవీన్ 33 బంతుల్లో 86 పరుగులు చేసి జట్టు విజయానికి పునాది వేశాడు. నవీన్‌కు 90వ వార్డు నాయకుడు చుక్క ప్రసాదరెడ్డి మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ అందించారు.

– మూడో మ్యాచ్‌లో ముర్రువాణి వారియర్స్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నారు. బ్యాటింగ్ చేసిన ఓల్డు గోపాలపట్నం జట్టు 12 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. ఛేజింగ్‌లో ముర్రువాని వారియర్స్ 10.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసి విజయ లక్ష్యాన్ని చేరుకున్నారు. విజేత జట్టు బ్యాటర్ 26 బంతుల్లో 43 పరుగులు చేసి వియానికి కారణమయిన రామ్‌సాయి మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.

వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు



కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతా భిషేకాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి పద్మావతి, ఆలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

రోడ్డుపైనే స్కూల్ బస్సుల పార్కింగ్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సులను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంపై స్థానికులు మండి పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అయోధ్య రామయ్య అక్షింతలు సిద్ధం



అక్షింతల ప్యాకింగ్ పాల్గొన్న రామభక్తులు

విశాఖ విద్య: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి తీసుకొచ్చిన అక్షింతలను భక్తులందరికీ పంపిణీ చేయడానికి వీలుగా శనివారం ప్యాకెట్లు సిద్ధం చేశారు. జీవీఎంసీ 52వ వార్డు కరాస రామలింగేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ మంజుల ఆధ్వర్యంలో మహిళలు అక్షింతలు ప్యాకింగ్ చేశారు. శ్రీరామ నామాన్ని జపిస్తూ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. నాట్య కళాకారుడు సాయినాథ్ మాస్టారు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీనివాస్, నాదెళ్ల జ్యోతి, తులసి, కళ, రూప వెంకటి, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయ ముఖద్వారం ప్రారంభం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే మళ్ల

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేటలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖద్వారాన్ని శనివారం ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచరపాలెం ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లి అమ్మవారి కరుణ అందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ద శివాజీ, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

- సంక్రాంతి నేపథ్యంలో 8,9,10 తేదీల్లో నిర్వహణ
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు

మల్కాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలో వచ్చే నెల 8,9,10వ తేదీల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆడారి ఆనంద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 8,9,10వ తేదీల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల మహిళలు తమ అప్లికేషన్లను ఈ నెల 5వ తేదీ లోగా పార్టీ కార్యాలయం, ఆయా వార్డుల్లో కేటాయించిన టీమ్‌కు గాని అందించాలన్నారు. 16 నుంచి 25 సంవత్సరాల లోపు వారు ఒక టీమ్‌గా, 26 నుంచి 40 సంవత్సరాల వారు మరో టీమ్‌గా.. 41 నుంచి 60 సంవత్సరాల వారికి మరో టీమ్‌గా పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. ఫైనల్ పోటీలు గోపాలపట్నం జెడ్పీ పాఠశాల మైదానంలో జరుగుతాయని తెలిపారు. కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మళ్ల ధనలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు కొణతాల సుధ,గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం , యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అలాగే స్వామివారికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది.1001 నామాలతో స్వామికి అర్చన చేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: యువత క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను శనివారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, కొణతాలసుధ, నాయకులు పిలక రామ్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్ల ఆవిష్కరణ

విశాఖ విద్య: పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల సౌకర్యార్థం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన మోడల్ టెస్టు పేపర్లను శనివారం డీఈవో ఎల్.చంద్రకళ ఆవిష్కరించారు. విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అదే విధంగా 2024 డైరీ, క్యాలెండర్‌లను కూడా డీఈవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్. అంబేడ్కర్ పాల్గొన్నారు.

కొత్త సంవత్సరం కళ



శ్రీహరిపురంలో వేసిన ముగ్గు

మల్కాపురం: పారిశ్రామిక వాడకు ఒక్క రోజు ముందే నూతన సంవత్సర శోభ వచ్చేసింది. పలు వాణిజ్య దుకాణాలతో పాటు నివాసాల వద్ద కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యుత్ లైట్లు, రంగు రంగు ముగ్గులు వేశారు. శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో బేకరీలు, స్వీట్ షాపుల్లో ప్రత్యేకంగా కేకులు సిద్ధం చేశారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



భూమిపూజలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ లావణ్య

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 58,59వ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్కాపురం: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. జీవీఎంసీ 58వ వార్డు పరిధి పలు అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్యతో కలిసి శనివారం భూమి పూజ చేశారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కుంచమ్మకాలనీలో సామాజిక భవనం, వీధి కాలువల నిర్మాణం కోసం రూ. 25 లక్షలు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. ఇదే వార్డు పరిధి శ్రీరామ్‌నగర్‌లో రూ.6 లక్షలతో కాలువ నిర్మాణ పనులు, దోబీఖాన నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు, పార్టీ నాయకులు కృష్ణ, చుక్క వరలక్ష్మి, దాట్ల శ్రీనివాస్‌రాజు (పొడుగు రాజు), బర్రి సంతోష్ పాల్గొన్నారు.

➤ 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో సుమారు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువ,సీసీ మెట్ల మార్గం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ,జేసీఎస్ కన్వీనర్ పిల్లా కన్నబాబు,శరగడం పత్నిరావు,భరత్,హరీష్,సరోజ,ఖాన్,సంపత్,కుంచారావు,జిలాని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ క్లస్టర్ కమిటీల నియామకం



కలిదిండి బద్రీనాథ్



అంగరామ్‌ప్రసాద్



జియ్యాని శ్రీధర్



బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని నాలుగు క్లస్టర్ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి క్లస్టర్‌కు అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు.

క్లస్టర్	అధ్యక్షుడు	ఉపాధ్యక్షులు
1	కలిదిండి బద్రీనాథ్	ఎం.ఎల్. నాయుడు, ఆడారి రమణబాబు
2	అంగరామ్‌ప్రసాద్	టి.దుర్గారావు, జి.ఎల్.వి.నరేష్
3	జియ్యాని శ్రీధర్	సర్వసిద్ధిసాయిలత, పెంటకోట ఆశాబాయి
4	బెహరా భాస్కరరావు	కూనుబిల్లి కిరణ్‌కుమార్, సమ్మెట్ల రామకృష్ణ

క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ



గోపాలపట్నం క్రైం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ వెంకటరత్నం

గోపాలపట్నం: గోపాలపట్నం క్రైం పోలీస్ స్టేషన్‌ను డీసీపీ వెంకటరత్నం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెస్ట్ క్రైం సబ్‌డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఆమె స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పాత పెండింగ్ కేసుల విచారణ ఏవిధంగా సాగుతుందో పరిశీలించారు. పాత కేసుల ఫైళ్లను పరిశీలించారు. ఆమెతో పాటు వెస్ట్ సబ్ డివిజన్ సీఐ బి. జగన్నాథరాజు, గోపాలపట్నం క్రైం ఎస్ఐ వెంకట సురేష్, ఏఎస్ఐ గోవిందమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

2 నుంచి 4వ తేదీ వరకు ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా షిర్డీ సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి రోజు మంగళవారం విఘ్నేశ్వరపూజతో పూజలు ప్రారంభిస్తారు.అనంతరం రక్షాసూత్రధారణ,పుణ్యావచనం,గోపూజ, అగ్నిప్రతిష్ఠ ఉంటాయి. రెండో రోజు బుధవారం సాయి మూల మంత్ర హోమం, సహస్ర కలశ స్థాపన, స్వామి వారి పల్లకీ ఊరేగింపు,వేదపారాయణ కార్యక్రమాలు ఉంటాయి. చివరి రోజు గురువారం సుప్రభాత సేవ,కాకడ హారతి, బాబా వారికి పంచామృతాభిషేకం ,సహస్ర కలశాభిషేకం,శిఖర మహా కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న మాజీ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన యు.మల్లేశ్వరరావు, వీర్రాజును తోటి ఉద్యోగులు, సొసైటీ కార్మికులు ఘనంగా సత్కరించారు. శనివారంలో సంస్థ ఆవరణలో భోజన విరామ సమయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సొసైటీ ఉద్యోగులు పూలమాలలు వేసి, సత్కరించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున చెక్‌లు అందజేశారు. సొసైటీ సెక్రటరీ సత్యనారాయణ మాట్లాడుతూ అంకిత భావంతో శ్రమించి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు పైల శ్రీరామమూర్తి, అధ్యక్షుడు బోసు, ధనుంజయ్, వెల్డింగ్ విభాగ కార్మికులు ఐ.కూర్మారావు, వి.మురళి, ఏబీవీ శ్రీను, అప్పారావు, మౌలాలి, నానాజీ, కిషోర్, నూకరాజు పాల్గొన్నారు.

➤ హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ పొందిన బలరామ్ అనే కార్మికుడిని షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయీస్ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మురళీధర్, జోగరాజు, మొప్ప చిరంజీవి, సింహాచలం, శ్రీనివాసరావు, నీలాది వంశీ పాల్గొన్నారు.